క్లుప్తంగా

సీహెచ్‌సీలో వైద్య సేవలు సంతృప్తికరం



గోపాలపురం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

గోపాలపురం: స్థానిక సీహెచ్‌సీలో వసతులు, మందుల నిల్వలు మెరుగుపడడంతో పాటు, సిబ్బంది సేవలు సంతృప్తికరంగా ఉండడంతో వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య కూడా పెరిగిందంటూ ఆ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి, సభ్యుడు పెనుగొండ బాలాజీ అభినందించారు. గోపాలపురం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి పనితీరు బాగా మెరుగు పడినందున రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ఇక్కడే వైద్యసేవలు పొందాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.శోభారాణి మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన అన్ని వసతులు, వైద్యులు అందుబాటులో ఉన్నందున మంచి సేవలు అందించగలుగుతున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ ఎస్‌కే వల్లీ, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గెల్లా వెంకటశ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

13న షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

కొవ్వూరు: కుమారదేవం గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆధ్యాత్మిక ధ్యాన మందిరం 17వ వార్షికోత్సవాన్ని ఈనెల 13న నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు గన్నమని వీర వెంకటరాజు, గద్దె గోపాలకృష్ణ మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం ఐదు గంటలకు నగర సంకీర్తన, 5.30 గంటలకు మేలుకొలుపు, 6 గంటలకు కాకడ హారతి, 8 గంటల నుంచి అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సీతారామ భజనమండలి ఆధ్వర్యంలో భజన,ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించనున్నట్టు వివరించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన, రాత్రి గ్రామంలో బాబా వారి పల్లకీ సేవ నిర్వహిస్తామన్నారు.

యువతకు వాలీబాల్ కిట్ అందజేత

కొవ్వూరు: బీసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ నాయకుడు తాతా కృష్ణారావు సతీమణి వెంకటేశ్వరి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వాత్సల్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, భోజన వసతి ఏర్పాటు చేశారు. మదర్‌థెరిసా వీధి బాలల పునరావాస కేంద్రంలో పిల్లల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పిల్లలకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కొవ్వూరు మండలంలో కాపవరం గ్రామానికి చెందిన యువకులకు వాలీబాల్ కిట్‌ను కృష్ణారావు, వెంకటేశ్వరి దంపతులు అందజేశారు.

దొండపూడిలో చలివేంద్రం ప్రారంభం

గోపాలపురం: హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని దొండపూడిలో మంగళవారం కూలింగ్ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ చలి వేంద్రాన్ని పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో ప్రతి గ్రామంలోనూ స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సర్పంచులు మల్లిపూడి అచ్చిబాబు, యండపల్లి శేఖర్ బాబు, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు, ఎంపీటీసీ సభ్యుడు మారాజు రాజేష్, కె. నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోల్నాటి సురేష్, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు మద్దు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు సక్రమంగా చెల్లించాలి

ఉండ్రాజవరం: తమకు సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరుతూ ఉండ్రాజవరం ఉపాధి హామీ కూలీలు కోరారు. ఉపాధి హామీ పనుల వేతనాలు సక్రమంగా అందడం లేదని, మస్టర్లు విషయంలో జరుగుతున్న అవకతవకలు సరిచేయాలని కోరుతూ కూలీలు మంగళవారం ఎంపీడీఓ ఏ. శ్రీనివాసుకు వారు వినతి పత్రం అందజేశారు. వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజని, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి సుధాకర్ వారి వెంట ఉన్నారు.

చీకట్లో మట్టి గుట్టను ఢీకొని ..



కొండేటి రాము (ఫైల్)

నల్లజర్ల: అచ్చన్నపాలెం సర్వీసు రహదారిపై సోమవారం అర్ధరాత్రి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మట్టి గుట్టను ఢీకొని మృతి చెందాడు. ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన కొండేటి రాము (39) జీడిగింజల కర్మాగారంలో వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రోజూ అతడు పూళ్ల నుంచి బైక్‌పై నల్లజర్ల మండలం నబీపేట వచ్చి వెళుతుంటాడు. ఇదే క్రమంలో సోమవారం రాత్రి బైక్‌పై బయలుదేరి అచ్చన్నపాలెంలో సర్వీసు రోడ్డుపై వస్తుండగా చీకట్లో కనిపించ మట్టి గుట్టను ఢీకొని పడిపోయాడు. తలకు తీవ్రగాయమైన అతడిని తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్టు నల్లజర్ల పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. ఆయన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తారెత్తిస్తున్న భానుడు

- 40 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- మరో నాలుగు రోజుల పాటు భగభగలే
- గతేడాదితో పోలిస్తే అధిక ఉష్ణ తీవ్రత



ఎండకు నిర్మానుష్యంగా ఉన్న కొవ్వూరు-దేవరపల్లి రహదారి

కొవ్వూరు: ఎండలు తారెత్తిస్తున్నాయి. భానుడి భగభగలతో జనం హడలిపోతున్నారు. వచ్చే నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ చేసిన హెచ్చరిక ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. సోమవారం కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు, దేవరపల్లి, తాళ్లపూడి మండలాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నల్లజర్ల, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 39 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యింది. మంగళవారం కూడా ఇంచుమించు అవే ఉష్ణోగ్రతలు కొనసాగాయి. గత నాలుగు రోజులుగా క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం పది గంటల నుంచే వేడి అధికంగా ఉంటోంది. ఉష్ణోగ్రతలు పెరగడానికి తోడు ఉక్కపోత కూడా తోడవడంతో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. ఉష్ణతాపం నుంచి ఉపశమనం కోసం ప్రజలు శీతల పానీయాలు, కొబ్బరిబొండాలు, జ్యూస్‌లు, ఇతర పానీయాలను ఎక్కువగా సేవిస్తున్నారు. ఎండ తీవ్రతకు వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఉక్కసారిగా ఉష్ణోగ్రత బాగా పెరగడంతో వేడిని తట్టుకోలేక అనేక మంది జలుబు, జ్వరం వంటి వ్యాధుల బారిన పడుతున్నారు.

గతేడాది కంటే అధికంగా..

గతేడాది ఏప్రిల్ 23న కొవ్వూరులో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదే నెల 27న గరిష్ఠంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్లలోను ఉష్ణోగ్రత గతేడాది ఏప్రిల్ 27న 40 డిగ్రీల మార్కునకు చేరుకుంది. అందుకు భిన్నంగా ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీ నాటికే ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరింది. రానున్న నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతోంది.అంటే గతేడాది కంటే 15 రోజుల ముందే ఎండలు ప్రతాపం చూపిస్తున్నాయి.

నిర్మానుష్యంగా రోడ్లు

ఎండల తారెత్తిస్తుండడంతో మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వ్యాపారాలు సైతం మందకొడిగా సాగుతున్నాయి. కొందరు వ్యాపారులైతే మిట్ట మధ్యాహ్నం రెండు, మూడు గంటల పాటు దుకాణాలను మూసివేస్తున్నారు. మళ్లీ ఎండల తీవ్రత తగ్గిన తర్వాత తెరుస్తున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

కొవ్వూరు డివిజన్ పరిధిలో గత పది రోజుల్లో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. ఈనెల 1న 4.2 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం పదో తేదీకి 4.6 మిలియన్ యూనిట్లకు పెరిగింది. మార్చి నెలాఖరులో 3.8 నుంచి 3.9 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండేది. ఎండల తీవ్రత పెరగడంతో విద్యుత్ వినియోగం సైతం అదే స్థాయిలో పెరుగుతోంది. ఏసీలు, ఫ్యాన్‌లు, కూలర్లు, ఫ్రిజ్‌లు వంటి వాడకం పెరగడమే దీనికి ప్రధాన కారణం. రానున్న రోజుల్లో విద్యుత్తు వినియోగం మరింత పెరిగే సూచనలున్నాయని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చెమట పట్టక పోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు రావడం, తగినంత నిద్ర పట్టకపోవడం, కలవరింతలు రావడం, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితికి వెళ్లడం వంటి లక్షణాలను వడదెబ్బగా గుర్తించాలి. మాంసాహారం తగ్గించాలి. తాజా కురగాయాలను ఆహారంగా తీసుకోవడం మంచిది. నీరు, పళ్లరసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. తక్కువ మోతాదులో ఆహారాన్ని ఎక్కువ సార్లు తీసుకోవాలి.

వడదెబ్బకు ప్రథమ చికిత్స అవసరం



వడదెబ్బ తగిలి అపస్మారక స్థితికి చేరిన రోగికి నీరు తాగించకూడదు. వెంటనే ఆసుపత్రికి తరలించాలి. గాలి తగిలే నీడ ప్రదేశంలో ఉంచాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకూ చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరాన్ని తడవాలి. ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్), ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం తాగించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు వేసవిలో అప్రమత్తంగా ఉండాలి.

– ఎస్.ధర్మరాజు, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దొమ్మేరు

ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్తు



కొవ్వూరు రెండో వార్డులో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ తదితరులు



ఖండవల్లిలో పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ సారథ్యంలో..



వేలివెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య ఆధ్వర్యంలో..

కొవ్వూరు: పట్టణ వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మంగళవారం ముమ్మరంగా నిర్వహించారు. 1, 2, 3, 5, 12, 20, 23 వార్డుల్లో గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. రెండో వార్డులో మాజీ ఎమ్మెల్యే కోడూరి శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు రుత్తల భాస్కరరావు, నగ్గల్లపాటి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులతో కలసి పర్యటించారు. ఒకటో వార్డులో నేతల వెంకటేష్, మాసా ఆనంద్, ఐదో వార్డులో కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత, మద్దిపట్ల దొరబాబులు, 12వ వార్డులో కౌన్సిలర్ అంకోలు వెంకట లీల్లి పద్మలీల, 20వ వార్డులో కౌన్సిలర్ పతివాడ నాగమణి, మాజీ కౌన్సిలర్ పతివాడ రామారావు ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇక 23వ వార్డులో నగ్గల్లపాటి శ్రీనివాస్, అద్దూరి సుబ్బారావులు గృహ సారథులు, వలంటీర్‌లతో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ పాలనపై ఐదు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.ప్రజా మద్దతు పుస్తకాల్లో నమోదు చేశారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లి, కానూరు, నడుపల్లి, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, వెంకట్రాయపురం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, కానూరు సర్పంచ్ భావన మధు, కొమ్మిశెట్టి రాము, బీరా సత్యవతిరాజు, బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వేలివెన్ను గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య ఆధ్వర్యంలో జగనన్నే మా భవిషత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. వెలగదుర్రులో సర్పంచ్ సాగి పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు ధనిశెట్టి భ్రమరాంబ, సూర్యారావుపాలెంలో సొసైటీ అధ్యక్షుడు కోటిపల్లి గణపతి ఈ కార్యక్రమం నిర్వహించారు.

నిడదవోలు రూరల్: పట్టణంలోని 28 వార్డుల్లోను, మండలంలోని అట్లపాడు, తాడిమళ్ల, రావిమెట్ల, కంసాలిపాలెం, పెండ్యాల, గోపవరం, సమిశ్రగూడెం, పందలపర్రు గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై లబ్ధిదారుల మద్దతుతో ఇళ్లకు స్టిక్కర్లు అతికించి వారి సెల్‌ఫోన్ల నుంచి మిస్డ్ కాల్స్ ఇప్పించారు. కార్యక్రమాల్లో వైస్ చైర్ పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ కర్రి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకే నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తీరుగూడెంలో ఫిష్ ఆంధ్ర మినీ రిటైల్ ఔట్‌లెట్ ప్రారంభం



లబ్ధిదారుల మినీ వ్యాన్‌లను ప్రారంభించి వారికి అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: వినియోగదారులకు తక్కువ ధరలకే నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర పథకానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. లబ్ధిదారుడు ముంగర శ్రీనివాస్ మండలంలోని తీరుగూడెంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర మినీ రిటైల్ ఔట్‌లెట్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాల ఆర్థిక బలోపేతానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీపై వాహనాలు అందజేస్తున్నారన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)లో భాగంగా సబ్సిడీపై నాలుగు చక్రాల మినీ వ్యానులను లబ్ధిదారులు ముంగర సత్యనారాయణ, ముంగర వెంకటేశ్వరరావు (నిడదవోలు), బండి అభిషేక్ (కొత్తపల్లి అగ్రహారం)లకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అందజేశారు. వాహనాలతో పాటు బతికిన చేపలు, చేప విత్తనం రవాణాకు 10 ట్యాంకులు, 10 ఆక్సిజన్ సిలిండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి కె.కృష్ణారావు, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ వి.దేవానందం, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, సింగవరం సర్పంచ్ పెన్మెత్స వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పెన్మెత్స నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లండి.. ప్రజాభిప్రాయం తెలుసుకోండి

- హోం మంత్రి తానేటి వనిత
- మద్దూరు,ధర్మవరంలలో వలంటీర్లు, గృహ సారథులకు దిశా నిర్దేశం



మద్దూరు సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారో? లేదో? అనేది తెలుసుకోవడం, గతం ప్రభుత్వ పాలనకు మన ప్రభుత్వ పాలనకు మధ్య వ్యతాస్యాన్ని ప్రజలకు వివరించడం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని మద్దూరు, ధర్మవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో మంత్రి వనిత మాట్లాడారు. వలంటీర్లు, గృహ సారథులు కలసి తమ పరిధిలోని 50 ఇళ్లకు వెళ్లి గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి గల తేడాను తెలియజేయడమే కాకుండా దీనిపై ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలేవైనా స్థానిక సమస్యలను చెబితే వాటిని ప్రజామద్దతు పుస్తకం వెనుక వైపు నమోదు చేయాలన్నారు. గృహ సారథులు, వలంటీర్లకు మా భవిష్యత్ నువ్వే జగనన్న కిట్లను మంత్రి వనిత అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, ఏఎంసీ ప్రస్తుత, మాజీ చైర్మన్లు వల్లభొట్టి శ్రీనివాస్, బండి పట్టాభి రామారావు, పార్టీ మండల అధ్యక్ష, గౌరవాధ్యక్షులు సుంకర సత్యనారాయణ, గన్నమని వీరవెంకటరాజు, మద్దూరు, దొమ్మేరు సొసైటీల అధ్యక్షులు తోట నారాయణ, ముదునూరి నాగరాజు, వైస్ ఎంపీపీ నూతంగి రేఖ తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి ఫూలే

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి
- పలు ప్రాంతాల్లో ఫూలే జయంతి



దేవరపల్లిలో ఫూలే చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు



నిడదవోలులో ఫూలే చిత్ర పటానికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు నివాళులు



ఉండ్రాజవరంలో ఫూలే చిత్ర పటానికి నివాళులు

దేవరపల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పూలే జయంతి వేడుకలను దేవరపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి ఎమ్మెల్యే తలారి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, మహిళా విద్యకు విశేష కృషి చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, పార్టీ మండల మహిళా కన్వీనర్ కడలి హైమావతి, నల్లజర్ల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బంకా అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ ఆధ్వర్యంలో దేవరపల్లి బస్టాండ్ సెంటర్లో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి నియోజకవర్గ నాయకుడు డి. సువర్ణరాజు, మండల శాఖ అధ్యక్షులు కాట్నం గణేష్, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నిడదవోలు రూరల్: సమాజంలోని సాంఘిక అసమానతలు తొలగించేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే పోరాటాలు, త్యాగాలు చేసి సాంఘిక విప్లవ పితామహుడిగా చరిత్రలో నిలిచిపోయారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే బస్టాండ్ సెంటర్లోని పూలే విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళుర్పించాయి. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని చిట్యాల ఎంపీయూపీ పాఠశాలలో పూలే జయంతి నిర్వహించారు. ఆ పాఠశాల హెచ్ఎం ఇస్సాపురి కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే గోపాలపురంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత పాల్గొన్నారు. ఇక దొండపూడిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కాసాని సతీష్‌కుమార్ (నాని) గ్రామ కమిటీ అధ్యక్షుడు పోల్నాటి సురేష్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. అలాగే గోపాలపురంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి మధుకర్‌జీ పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక శెట్టిబలిజ రామాలయం వద్ద బీసీ సంక్షేమ సంఘం మండల నాయకుల ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాలాటి శరత్‌బాబు, పీపీ రాము, బొక్క వెంకటేశ్వరరావు, గుబ్బల రాఘవులు, బొక్క నరసింహమూర్తి, కోన జయ, వి.ప్రభువరం, మారిశెట్టి నాగేశ్వరరావు, కారంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై కె.రామారావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పూలే చిత్ర పటానికి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, యాళ్ల బాబురావు, ముళ్ల పోశిబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తాళ్లపూడి సచివాలయం వద్ద నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, వెల్ఫేర్ అసిస్టెంట్ జి.గణేష్, రమేష్, రేవతి తదితరులు పాల్గొన్నారు. రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో హెచ్ఎం డి.దుర్గారావు ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

కొవ్వూరు: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, నాయకుడు దగ్గు రాధాకృష్ణ తదితరులు పూలేకు నివాళులు అర్పించారు. టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, నాయకులు పాల్గొన్నారు. స్థానిక బీసీ బాలుర వసతిగృహంలో మాల మహాసభ జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బొంతా శ్యా రవి ప్రకాష్, రిటైర్డు హాస్టల్ వార్డెన్ పెనుమాక జయరాజు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పెరవలి: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో ముక్కామల గ్రామంలో జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గుమ్మాపు చిత్రసేన్, బద్ధా జాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనంతపల్లిలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మహ్మద్ ఇలియాస్ షరీఫ్

నల్లజర్ల: ముస్లింలకు ఉత్తమ జీవన మార్గాన్ని చూపేదే రంజాన్ అని జమాతే ఇస్లామి హింద్ మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఇలియాస్ షరీఫ్ అన్నారు. అనంతపల్లి మసీదులో ముస్లింలకు తాళ్లూరి శ్రీనివాస్, సుశీల, ధన్యశ్రీల సౌజన్యంతో మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ రంజాన్ ఉపవాసాల వల్ల ఓర్పు, పవిత్రత, సమయపాలన, దానశీలత, సామరస్యం వంటి అంశాలపై మన దృష్టి కేంద్రీకృతం అవుతుందన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ అహమ్మద్ వలీ, ముస్లిం నాయకులు ఎంఎం ఆలీ సాహెబ్, ఆఫీజ్ మహమ్మార్, పెంటు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నవధాన్యాల కిట్లు

పెరవలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ అన్నారు. మండలంలోని ముక్కామల గ్రామ రైతులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 30 రకాల విత్తనాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ వరి కోతలకు ముందు నవధాన్యాల విత్తనాలు చల్లుకోవాలని, లేని పక్షంలో పచ్చిరొట్ట సాగు చేయాలని సూచించారు. రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. మండల ఇన్‌చార్జి బుజ్జి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాది పొడవునా కిచెన్ గార్డెన్స్ వేయాలి

దేవరపల్లి: ఏడాది పొడవునా ఇళ్ల వద్ద కిచెన్ గార్డెన్స్ వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు మహిళలకు సూచించారు. దుద్దుకూరులో మంగళవారం గ్రామ సంఘ సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థ కో-ఆర్డినేటర్ ప్రకాశరావు కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటల పెట్టుబడులకు గ్రూపు నుంచి రుణాలు ఇస్తున్నామన్నారు. గ్రామ సంఘంలో మొత్తం భూమిని ప్రకృతి ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటలు సాగు చేయాలన్నారు. ఈ ఏడాది మొత్తం విస్తీర్ణంలో నవధాన్యాలు వేయాలని సూచించారు. రైతులకు నవధాన్యాల కిట్లు అందజేశారు. సమావేశంలో డీపీఎం ఎస్‌కే వల్లీ, సీసీలు హరీష్, గౌతం, రాజేష్, మాస్టర్ ట్రైనింగ్ శ్రీనివాస్, సబ్ డివిజన్ యాంకర్ కృపావతి, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

గోపాలపురం: బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి జి.మధుకర్ అన్నారు. ఆ పార్టీ నాయకులతో మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ గ్రామాల్లో శక్తి కేంద్రాలు, బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

చాగల్లు: జగనన్న గృహ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని హౌసింగ్ ఏఈ కె. వెంకటరమణ సూచించారు. చాగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సచివాలయం 1, 2 పరిధిలోని జగనన్న కాలనీ గృహ లబ్ధిదారులతో మంగళవారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. జగనన్న కాలనీలోని 1166 మంది లబ్ధిదారుల్లో సగం మంది ఇప్పటికే గృహ నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎల్. రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయకుమారి, తులసి తదితరులు పాల్గొన్నారు